క్లుప్తంగా

కొనసాగుతున్న మండలదీక్ష మాలధారణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి మండల దీక్షా మాల ధారణ కార్యక్రమం కొనసాగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని మాలధారణ చేశారు. ఈనెల 31 వరకు మండల దీక్షా మాలధారణ సాగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

సర్వే పనుల పరిశీలన

జగ్గయ్యపేట:మండలంలోని ధర్మవరప్పాడు తండ, జయంతిపురం, రావిరాల గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఎంపీడీవో నితిన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఇంటి కొలతల సర్వేచేస్తున్నట్లు తెలిపారు. కొలతల్లో తప్పొప్పులను ఇళ్ల యజమానులు సర్వే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ధర్మవరప్పాడుతండలో గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలనని సిబ్బందికి సూచించారు.

నగర సంకీర్తన



జగ్గయ్యపేట: పట్టణంలో శుక్రవారం అయ్యప్ప దీక్షా మాలధారులు నగర సంకీర్తన నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో కలశాలతో నగర సంకీర్తన చేశారు. గురుస్వామి ఏలూరి రాంబాబు ఆధ్వర్యంలో దీక్షా స్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీంతో పట్టణంలో అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



పెనుగంచిప్రోలు: క్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సత్రంసెంటర్‌లోని బీసీ కాలనీలో మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామారావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి కృతజ్ఞత సువార్త సభ నిర్వహించారు. కృపమినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ మాథ్యూస్ మాట్లాడుతూ దేవుని కృతజ్ఞత కలిగి ఉండటం అంటే ఆయన చేసిన మేలును గుర్తుంచుకుని ఆయన చూపిన మార్గంలో పయనించడమేనని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు చల్లా వైకుంఠరావు, బిషప్ జాన్‌విక్టర్‌బాబు, పాస్టర్ చింతల రామారావు, పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

వేల్పులకు ఘనసత్కారం



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నెడ్‌క్యాప్ మాజీ చెర్మన్ వేల్పుల రవికుమార్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయానికి విచ్చేసిన వేల్పుల రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వేల్పుల రవికుమార్ మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 38 అర్జీలు



కంచికచర్ల: స్థానిక సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ 28మంది రైతులు అర్జీలు అందించినట్లు తహసీల్దార్ జాహ్నవి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, సర్పంచి వేల్పుల సునీత, డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ వెంకట్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు పది అర్జీలు ..

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): అనుమంచిపల్లి సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ పదిమంది రైతులు అర్జీలు అందజేశారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో పొలాలు ఇచ్చామని, మిగిలిన పొలం కూడా రహదారి పరిధిలో ఉందని చూపుతుందంటూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఆర్ఐ సూరమ్మ, సర్వేయర్ అనూష్‌బాబు, సర్పంచ్ త్రివేణి, వీఆర్వో వెంకటరత్నం పాల్గొన్నారు.

బాబు అంటేనే బాదుడు

- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు
- చార్జీలను వెంటనే తగ్గించాలంటూ నిరసన ర్యాలీలు

నందిగామటౌన్: విద్యుత్ చార్జీలు పెంచబోము.. అవసరమైతే తగ్గిస్తాం..ప్రజలచేత విద్యుత్ తయారు చేయించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందంటూ ఎన్నికల సమయంలో ఇష్టారీతిన హామీలు గుప్పించిన సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలను పెంచి తననైజాన్ని మరోసారి చాటుకున్నారని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు వందలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని గాంధీసెంటరు నుంచి విద్యుత్‌శాఖాధికారి కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లి వినతి పత్రం అందజేశారు. గాంధీసెంటరులోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత రెండు నెలల్లోనే విద్యుత్ చార్జీల పెంపు ద్వారా రాష్ట్రప్రజలపై రూ.15,485.36 కోట్ల భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించే 100యూనిట్ల విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచారని గుర్తుచేశారు. నందిగామ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యుత్ కనెక్షన్లు 19వేల వరకు ఉండగా, వీరికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇవ్వకపోగా ట్రూఅప్ చార్జీల పేరుతో అదనపు భారం మోపుతోందన్నారు. రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో ఆటవిక పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు.

విద్యుత్ రంగాన్ని ముంచింది చంద్రబాబే..

ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని నిలువునా ముంచింది సీఎం చంద్రబాబేనని అన్నారు. 2014నాటికి రూ.29వేల కోట్ల అప్పులు, బకాయిలుంటే 2019లో చంద్రబాబు దిగిపోయే నాటికి అవి రూ. 86వేల కోట్లకు చేరాయని గుర్తుచేశారు. డిస్కంలకు చంద్రబాబు తనహయాంలో రూ. 13,255 కోట్లు అందజేస్తే వైఎస్ జగన్ ప్రభుత్వం రూ. 47వేల కోట్లను అందించి ఆదుకుందన్నారు. చంద్రబాబు హయాంలో అవసరం లేకపోయినా అధిక ధరలకు విద్యుత్‌ను కొని, చేసుకున్న ఒప్పందాలే నేడు ప్రజల పాలిట శాపంగా మారాయని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ష్యూరిటీ సంగతి ఏమోగాని, అధికారంలోకి వచ్చిన తరువాత బాదుడు మాత్రం గ్యారెంటీ అన్నట్లుగా పరిస్థితి ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్, ట్రూఅప్ తదితర చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. చార్జీలు తగ్గించే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు ఓర్సు లక్ష్మి, పాకాలపాటి కిరణ్, పట్టణ, మండల కన్వీనర్లు వేమా సురేష్‌బాబు, మంచాల చంద్రశేఖర్, బండి మల్లికార్జునరావు, కందుల నాగేశ్వరరావు, అవుల రమేష్‌బాబు, పార్టీ రాష్ట్ర సంయుక్తకార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, కంచికచర్ల ఎంపీపీ మలక్‌బషీర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మహ్మద్ మస్తాన్, వెలగపూడి వెంకటేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, ఓర్సు జ్వాలా, చింతా రవీంద్రనాథ్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పాములపాటి రమేష్, మువ్వల శ్రీను, పలువురు నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు



పేట విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన వేల్పుల రవికుమార్

మాట తప్పిన చంద్రబాబు గద్దె దిగాలి

జగ్గయ్యపేటఅర్బన్: తాను విద్యుత్ చార్జీలను తగ్గిస్తానంటూ ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు, ఏడునెలల్లో రెండుసార్లు విద్యుత్‌చార్జీలను పెంచారని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో శుక్రవారం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వద్దనున్న విద్యుత్‌శాఖ ఏడీఈ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్‌చార్జీలను పెంచనంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను చంద్రబాబు తప్పారన్నారు. వరదలకు పంటలను కోల్పోవడంతోపాటు పెరిగిన నిత్యావసరాల ధరలతో అల్లాడుతున్న ప్రజలపై విద్యుత్‌చార్జీల పెంపు రూపంలో చంద్రబాబు ప్రభుత్వం రూ.15వేల భారం వేయడం దారుణమన్నారు. వరదలకు దెబ్బతిన్న విద్యుత్‌లైన్లను నేటికీ పునరుద్ధరించకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. గతంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ ప్రచారం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నేడు వారి పాలనలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని గుర్తుచేశారు. అబద్దాలు చెప్పడంలో చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రసిద్ధిగాంచారని విమర్శించారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి వేల్పుల రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిజంగా ప్రజల మేలు కోరుతున్నట్లయితే పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ అమలుచేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటే మరిచిపోయారన్నారు. ప్రజలపై భారం పడితే ప్రశ్నిస్తామని చెప్పిన డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా ప్రస్తుతం నోరుమెదపడం లేదన్నారు. విద్యుత్‌చార్జీలను పెంచబోమంటూ ఇచ్చిన హామీని విస్మరించినందున ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో పెంచిన విద్యుత్‌చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత విజిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కూడా ఎగకొట్టారని విమర్శించారు. అనంతరం విద్యుత్‌చార్జీలను తగ్గించాలని కోరుతూ విద్యుత్‌శాఖ ఏడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట పట్టణ, మండల అధ్యక్షులు వట్టెం మనోహర్, బూడిద నరసింహారావు, ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, కార్యదర్శులు మాతంగి నాగబాబు, ధరావత్ రూప్లా నాయక్, షేక్ జుబేర్, వేముల మల్లేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, మాజీఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, ఎస్టీ, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బద్దూ నాయక్, కన్నమాల శామ్యూల్, విజయవాడ దుర్గగుడి డైరెక్టర్ నంబూరి రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ గూడపాటి శేషయ్య, రైతు విభాగం నాయకుడు అన్నాబత్తుల శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు చల్లా సుశీల, నాయకులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, జవ్వాజి నరసింహారావు, గోగుల వెంకయ్య, మన్నె శ్రీనివాసరెడ్డి, బూతుకూరి కొండారెడ్డి, పింగలి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, మోరె దుర్గాప్రసాద్, గంగోలు వినోద్, శీలం ప్రభాకరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో నిరసన ర్యాలీ చేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వేల్పుల రవికుమార్, నాయకులు



నందిగామ విద్యుత్ ఏడీఈ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు



విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జగ్గయ్యపేటలో ర్యాలీ చేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వేల్పుల రవికుమార్, సంపత విజిత, హఫీజున్నీసా ఫిరోజ్ తదితరులు



నందిగామలో విద్యుత్ శాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

పెనుగంచిప్రోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా నిరంతరం ఆదాయం లభిస్తుందని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. స్థానిక డంపింగ్ యార్డ్ స్థల ఆవరణలో ఏటీఎం(ఎనీ టైం మనీ) మోడల్‌లో 20 సెంట్ల స్థలంలో 25రకాల విత్తనాలతో ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతి, తీగజాతి విత్తనాలు, మొక్కలను బీజామృతంలో శుద్ధిచేసి ఘన జీవామృతంతో నాటారు. మాస్టర్‌ట్రైనర్ వస్నూరప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, పీఆర్ ఏఈ సుందరరామయ్య, కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.



సాగు విధానాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, రవికుమార్

భూసమస్యలను పరిష్కరిస్తాం : ఆర్డీఓ

చందర్లపాడు(నందిగామ టౌన్): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు దరఖాస్తులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాల్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ముప్పాళ్లలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో

బ్యాంకు రజతోత్సవ వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కోస్టల్ బ్యాంకు వార్షికోత్సవాన్ని శుక్రవారం స్థానిక బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బ్రాంచ్‌లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్, విజయవాడ వారి సహకారంతో మెడికల్ అండ్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బ్యాంకు వినియోగదారులు వైద్యశిబిరంలో పాల్గొని వైద్యసేవలు పొందారు. బ్యాంకు మేనేజర్ కె.బ్రహ్మారావు మాట్లాడుతూ కోస్టల్ బ్యాంకు వినియోగదారులకు విశ్వసనీయమైన సేవలను అందిస్తున్నట్లు వివరించారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



కోస్టల్ బ్యాంకులో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న బ్యాంకు వినియోగదారులు

మిర్చి తోటల పరిశీలన

వీరులపాడు: మండలంలోని పెద్దాపురంలో సాగు చేస్తున్న మిర్చి తోటలను ఉద్యాన శాఖాధికారి నీలిమ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె జిగురు పూసిన పసుపు, నీలం రంగు అట్టలను ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేయడం ద్వారా నల్లతామర పురుగును నివారించవచ్చని రైతులకు సూచించారు.



మిర్చి తోటను పరిశీలిస్తున్న ఉద్యానాధికారి నీలిమ

మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులు

జగ్గయ్యపేట: మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు వట్టెం మనోహర్, బూడిద నరసింహారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, జుబేర్, డేరంగుల శ్రీను, జగదీష్, డబ్బాకుపల్లి సర్పంచ్ నగేష్, కొలుసు తిరుపతిరావు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పిల్లి భాస్కరరావు, శీలం ప్రభాకర్, జవ్వాజి నరసింహారావు, కరిసె ఇజ్రాయేలు, బెజవాడ శ్రీనివాసరావు ఉన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో...

మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌కు టీడీపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తననివాసంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అదేవిధంగా జనసేన పార్టీ నాయకులు తుమ్మల ప్రభాకర్, ఆవాల భవానీప్రసాద్, శేషం ప్రసాద్ తదితరులు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ ఎం.రామ్మోహనరావు, డీఈ కలిముల్లా, ఏఈ అహ్మద్, సిబ్బంది నివాళులర్పించారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఎంపీడీఓ జి శ్రీను పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ అజెండాలోని అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, ఏఓ కె రామసుబ్బారెడ్డి, ఎంఈఓ డి.రవీంద్ర, పశువైద్యాధికారి పి.అనిల్,ఏఈ సుందరరామయ్య, ఇరిగేషన్, ఎన్ఎస్‌పీ ఏఈ లక్ష్మి, ఉద్యానవన శాఖాధికారి వర్ధిని, గోపి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న తన్నీరు, నాయకులు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ శ్రీను తదితరులు

నందిగామ పట్టణంలో..

నందిగామ టౌన్: గాంధీ సెంటరులో శుక్రవారం మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్, నాయకులు నివాళులర్పించారు.

ఆలయ ధర్మకర్తగా 'చిరుమామిళ్ల'

నందిగామ టౌన్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా చిరుమామిళ్ల వెంకట లక్ష్మీ సాయిబాబు నియమితులయ్యారు. దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సాయిబాబును నియమించినట్లు ఏసీ సీతారామయ్య తెలిపారు. దీంతో లక్ష్మీ సాయిబాబు శుక్రవారం ఆలయ ఆవరణలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిట్స్ సేవలు మరువలేనివి

నందిగామటౌన్: విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా కిట్స్ సంస్థ అందిస్తున్న సేవలు మరువలేనివని సీడ్‌ఆప్ చైర్మన్, మాజీఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని అంబారుపేట గ్రామంలోని కిట్స్ సంస్థ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసే స్కిల్ డెవలప్‌మెంట్, మహిళా సాధికారత కేంద్రాలు యువతకు ఎంతో దోహదపడతాయన్నారు. కిట్స్ సంస్థకు తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, గంగాధర్, జగన్నాధరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

గోపినేనిపాలెం(వత్సవాయి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ మెడలో గొలుసు అపహరించి పారిపోతున్న దొంగను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్న సంఘటన మక్కపేట–గోపినేనిపాలెం రోడ్డులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వైరా మండలం హసన్‌పర్తి గ్రామానికి చెందిన గంతోటి బాలశౌరి, కరుణమ్మ దంపతులు శుక్రవారం మధ్యాహ్నం మోటార్ సైకిల్‌పై పెనుగంచిప్రోలు మండలం ముళ్లపాడులోని వారి కుమార్తె ఇంటికి వచ్చారు. అక్కడ్నుంచి జగ్గయ్యపేట మండలం గండ్రాయిలో ఉంటున్న మరో బంధువు ఇంటికి వెళ్తుండగా మక్కపేట–గోపినేనిపాలెం గ్రామాల మధ్య వెనుకనే మరో ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు కరుణమ్మమెడలో ఉన్న రూ.2లక్షల విలువగల బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడు. దీంతో బాధితులు అదేరోడ్డులో వెళ్తున్న వాహనదారులకు విషయాన్ని తెలుపగా, వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు మంగొల్లు–గండ్రాయి రహదారిలో నిఘా పెట్టి గండ్రాయి చెక్‌పోస్టు వద్ద నిందితుడు తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం బాలాజీనగర్‌కు చెందిన బర్మావత్ నాగరాజుగా గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.